సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి


జీహెచ్‌ఎంసీ నూతన ఏఈ తివారీని కలిసిన బీజేపీ నేతలు

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి హంసరాజు కోరారు. జీహెచ్‌ఎంసీ అడ్డగుట్ట డివిజన్ ఏఈ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తివారీని తుకారాంగేట్‌లోని వార్డు కార్యాలయంలో బీజేపీ నాయకులు శనివారం కలిసి సత్కరించారు. అంతకు ముందు ఏఈ గా విధులు నిర్వహించి బదిలీపై తార్నాకకు వెళ్తున్న వేణును కూడా శాలువాతో సత్కరించారు. నాయకులు ఎల్. వెంకటస్వామి, పీ. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో కార్పొరేటర్ పర్యటన


ఇందిరానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. ఇక్కడ నిరంతరంగా రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీటి సమస్యలను ఆమె సమీక్షించారు. తాత్కాలికంగా సీవరేజి పైప్ లైన్ నుంచి చెత్తను, మట్టిని తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. కొద్ది రోజుల్లో ఈ ప్రాంతంలో కొత్త పైప్‌లైన్లను వేయడం ద్వారా ఇక్కడ ఎదురవుతున్న మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు రాము, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తార్నాక జంక్షన్ పునరుద్ధరణ నిర్ణయంపై స్థానికుల హర్షం


ప్రారంభం కానున్న తార్నాక జంక్షన్

లాలాపేట: దాదాపు 8 సంవత్సరాల నుంచి బంద్ ఉన్న తార్నాక జంక్షన్(సిగ్నల్)ను వచ్చే రెండు వారాల్లో పునరుద్ధరిస్తామని ట్రాఫిక్ అడిషినల్ కమిషనర్ విశ్వప్రసాద్ ప్రకటించడంపై తార్నాక వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం పలువురు తార్నాక వాసులు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఈ సమస్యపై తార్నాక వాసులు వినతి పత్రాలు సమర్పించగా డిప్యూటీ మేయర్ పలు దఫాలుగా ఆయా విభాగాల అధికారులతో మాట్లాడారు.

బ్రెయిన్‌స్ట్రోక్ ఘటనలు పెరిగి పోయాయి


కార్యక్రమంలో వైద్యులు, బాధితులు

అమీర్‌పేట: బ్రెయిన్ స్ట్రోక్ ఘటనలు ఇటీవల పెరిగి పోయాయని అస్టర్ ప్రైమ్ ఆసుపత్రి వైద్య నిపుణులు అనిరుధ్ దేశ్‌ముఖ్ అన్నారు. స్ట్రోక్ డే ను పురస్కరించుకుని బాధితులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు ఏంటో తెలుసుంటే స్ట్రోక్ రాగానే తొలి మూడు గంటల్లో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటే పూర్తిగా ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బొల్లారం–కల్వరి బ్యారక్ మౌలాలి సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద మృతదేహం పడిఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు.సుమారు 35 సంవత్సరాల వయసున్న సదరు వ్యక్తి రైలు డోరు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.



అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నాలుగు నెలలుగా

నామమాత్రపు సేవలు

అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రానికి వైద్యుడి కొరత


రోగుల శాంపిల్స్ వివరాలు ఎంట్రీ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

- వారానికి ఒకరోజు కేంద్రానికి ఇన్‌చార్జ్ వైద్యుడు
- మెరుగైన వైద్య సేవలకు దూరమవుతున్న రోగులు

అడ్డగుట్ట: అడ్డగుట్టలో వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉంటారు. వీరిలో నిత్యం రెక్కాడితే కాని డొక్కాడని ప్రజలు ఎంతో మంది ఉన్నారు. అటువంటి వారికి జబ్బు చేసిన సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చూపించుకుంటారు. ఇటువంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్న అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో నాలుగు నెలలుగా వైద్యుడు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇది వరకు ఉన్న వైద్యాధికారి నాలుగు నెలల క్రితం బదిలీ అయ్యాడు. అప్పటి నుంచి ఆరోగ్య కేంద్రంపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం కారణంగా సరైన వైద్య సేవలు అందక ఇక్కడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అడ్డగుట్ట ఏ,బీ,సీ, డీ సెక్షన్లు, తుకారాం గేట్, మరాఠాబస్తీ, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పేద మధ్య తరగతి ప్రజలు వైద్య సేవల నిమిత్తం ఇక్కడికే వస్తుంటారు. వైద్యుడు లేకపోవడంతో రోగులకు కేవలం మందులు, మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. వైద్యుడు ఎటువంటి చెకప్ చేయకుండా కేవలం మాత్రలతో సరిపెట్టుకోవడం ఏంటని రోగులు అడిగినప్పటికీ సరైన సమాధానం అందడం లేదు. నాలుగు నెలలుగా ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో డబ్బులు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ప్రజలు వాపోతున్నారు.

ఆస్పత్రిలో సిబ్బంది వివరాలు

కేంద్రంలో పీహెచ్‌ఎన్‌తో పాటు 22 మంది ఆశా వర్కర్లు, నలుగురు స్టాఫ్ నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఆయా, వాచ్‌మెన్‌లు ఉన్నారు. ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారితో పాటు మరో నలుగురు ఏఎన్‌ఎంలు అవసరం ఉంది. సిబ్బంది కొరత తీరిపోతే రోగులకు వెసులుబాటు ఉంటుందని, రోగులకు మరింత మెరుగైన సేవలు అందేందుకు వీలుగా ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.


మందులు, మాత్రలు ఇస్తున్న ఫార్మాసిస్ట్

వారానికి ఒకరోజు ఇంచార్జ్ వైద్యుడు

అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో నాలుగు నెలలుగా వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఇంచార్జ్ వైద్యుడిగా లాలాపేటలోని ఆస్పత్రికి చెందిన వీరు అనే వైద్యుడిని నియమించారు. కాగా, ఆయన కేవలం వారంలో ఒక రోజు మాత్రమే ఇక్కడి ఆరోగ్య కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో రోగులందరూ పనులు మానుకొని అదే రోజు ఆరోగ్య కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఆ రోజు వైద్యుడ్ని సంప్రదించకపోతే తిరిగి వచ్చే వారం వరకు ఎదురు చూస్తున్నారు కొందరు పేద ప్రజలు, మిగతా వాళ్లు చేసేదేమి లేక ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీలో పాలనా పదవుల్లో మహిళలకు అవకాశం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల పాలనా పదవుల్లో మహిళలకు చోటు కల్పించాలని తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం గౌరవాధ్యక్షురాలు, విశ్రాంత ప్రొఫెసర్ కసూర్తి లక్ష్మీ శనివారం కోరారు. వర్సిటీల వీసీల నియామకంలో మహిళలకు అవకాశాలు ఇవ్వలేదని, వర్సిటీల రిజిస్ట్రార్లు, వోఎస్‌డీలు, డైరెక్టర్లు, ఎగ్జామినేషన్ కంట్రోలర్లు, ప్రిన్సిపల్స్ తదితర పాలన పదవుల్లో మహిళలను నియమించాలన్నారు. వర్సిటీల్లో 70 శాతం అమ్మాయిలే చదవుతున్నా పాలన పదవుల్లో అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విద్యా కమిషన్, విద్యా సలహా మండలి తదితర పదవుల్లో మహిళలకు స్థానం దక్కకపోడవం బాధాకరమన్నారు. మహిళల ఓట్లు కావాలి కానీ పదవుల్లో చోటు కల్పించారా అని ప్రశ్నించారు. పాలన పదవుల్లో మహిళలకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ఓయూ స్నాతకోత్సవాన్ని నిర్వహించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 84వ స్నాతకోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ యాదవ్ శనివారం అధికారులను కోరారు. వీసీ నియామకంలో ఆలస్యం వలన గత నెల జరగాల్సిన స్నాతకోవడం నిలిచిపోయిందన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ స్నాతకోత్సవ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పీజీ, పీహెచ్‌డీలతో పాటు బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు స్నాతకోత్సవం కోసం ఎదురు చూస్తున్నారని అశోక్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

5 నుంచి అమరుల వర్ధంతి సభలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆశయాల కోసం అసువులు బాసిన అమరుల వర్ధంతి సభలు ఈ నెల 5 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట వర్ధంతి సభల విసయవంతం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తీగల శ్యామ్, కే.జాన్సీ, యశ్వంత్, అసిఫ్, సంతోష్, సైదులు, రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నకూట మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

రసూల్‌పురా: నగరంలో ప్రసిద్ధి చెందిన రసూల్‌పురాలోని స్వామి నారాయణ ఆలయంలో శనివారం గుజరాత్ సమాజం ఆధ్వర్యంలో అన్నకూట మహోత్సవం నిర్వహించారు . స్వామి నారాయణునికి వెయి రకాల ఆహారపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటేల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు హజరై ఈ అన్నకూట మహోత్సవం, హారతి, భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఏపీఎస్ అక్షర్‌ధామ్ అధిపతి ఆత్మ చింతన్ దాస్, విమల మునిదాస్, పలువురు సాధువులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, అవినాష్ బండారి, విశాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రీగణేష్

శరణుఘోషతో మార్మోగిన ఆలయ ప్రాంగణం


అయ్యప్ప మాలాధారణ చేసిన భక్తులు

సనత్‌నగర్: స్వామియే శరణమయ్యప్ప అంటూ ఆ ప్రాంతం శరణుఘోషతో మార్మోగింది. పవిత్ర కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని వందలాది మంది భక్తులు అయ్యప్ప దీక్ష చేపట్టారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని అయ్యప్ప దేవాలయం వేదికగా జరిగిన దీక్షాధారణ కార్యక్రమంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలాయి. అఖిలభారత అయ్యప్ప సేవా సంఘం ప్రధాన కార్యదర్శి అరుణ్‌గురుస్వామి దాదాపు 500 మంది భక్తులకు మాలాధారణ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులతో సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయం కోలాహలంగా మారింది.

ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం సీతాఫల్‌మండిలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాధన సమితి ప్రతినిధులు మిట్టపల్లి బాబురావు, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు వినూత్న రీతిలో అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచినందుకు ఓయూలో విద్యార్థులు వినూత్నంగా అభినందనలు తెలిపారు. శనివారం తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవత రాయ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ముఖానికి సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు గల మాస్కలు దరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుర్గం వినోద్, హేమంత్ చౌదరి, మల్లికార్జున్, అశోక్, సాయి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దలను స్మరించుకున్న క్రైస్తవ సోదరులు


బిస్కెట్స్, మంచినీరు, జ్యూస్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో శనివారం క్రైస్తవులు ఆల్‌సోల్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు క్రైస్తవ శ్మశానవాటికలు ప్రజలతో కళకళలాడాయి. చనిపోయిన తమ కుటుంబీకులను జ్ఞాపకం చేసుకుంటూ పూజలు చేశారు. పువ్వులతో పాటు కొవ్వొత్తులను వెలిగించి చనిపోయిన తమ కుటుంబీకులను తలుచుకొని ప్రార్థనలు చేశారు. బొందలను అందంగా అలంకరించి అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేయడం కనిపించింది. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బోయిగూడలోని క్యాథలిక్ గ్రేవ్ యార్డులో జరిగిన ఆల్‌సోల్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, నాయకులు లక్ష్మీపతి, రాజు, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్‌కుమార్ గౌడ్, సునీల్, రవి తదితరులు పాల్గొన్నారు.

మొదలైన కార్తీక శోభ


ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునుడు..


శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి..

సనత్‌నగర్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఓం నమఃశ్శివాయ నామ స్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆకాశ దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అలాగే శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య సహస్రనామార్చన,విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి.

వెబ్‌సైట్‌లో మత విద్వేషపూరిత వ్యాసాలు

- మారేడుపల్లి పీఎస్‌లో కేసు నమోదు

కంటోన్మెంట్: ఆన్‌లైన్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాసాలు ప్రచురించిన వెబ్‌సైట్ నిర్వాహకులపై మారేడుపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. హైకోర్టు న్యాయవాది ఇమ్మనేని రామారావు, సికింద్రాబాద్ 10వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా కేసు నమోదు చేశారు. న్యాయవాది రామారావు ఫిర్యాదు మేరకు.. ఇస్లామిక్ స్టేట్ ఖురాసన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) తన వెబ్‌సైట్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టారు. రెచ్చగొట్టే వ్యాసాలను ప్రచురిస్తున్న ఐఎస్‌కేపీ వెబ్‌సైట్ నిర్వాహకులు ఇఫ్తికార్ ఫిర్‌దౌస్, ఇషానుల్లా టిపు మెహసుద్, రికార్డో వల్లే, ఫకర్ కక్కేల్, నవాబ్ అలీ కటక్, కిరణ్‌బట్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. మారేడుపల్లి పోలీసులు ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సదర్ పండగ నిర్వహణ ఆనవాయితీ


సదర్ కార్యక్రమంలో పాల్గొన్న గజ్జేల నాగేష్

రసూల్‌పురా : యాదవులు దీపావళి పండగ తర్వాత సదర్ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జేల నాగేష్ అన్నారు. కంటోన్మెంట్ బొల్లారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్. గజ్జేల నాగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు ఐక్యతను చాటే వేడుక సదర్ ఉత్సవాలని అన్నారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలను నాగేష్ తిలకించారు. కార్యక్రమంలో జంగాల మురళి యాదవ్, బాలరాజు యాదవ్, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యవేదిక కన్వీనర్ చక్రధర్‌యాదవ్

సదర్ ఉత్సవాల నిర్వహణపై జీఓ హర్షణీయం

సనత్‌నగర్: యాదవ సదర్ సమ్మేళన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా నిర్వహించేలా జీఓ తీసుకురావడం శుభపరిణామమని యాదవ ఐక్యవేదిక కన్వీనర్ యల్లావుల చక్రధర్‌యాదవ్ అన్నారు. సదర్ ఉత్సవాలు అధికారిక నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకురావడం పట్ల పలువురు యాదవ సంఘం నేతలతో శనివారం ఆయన స్వీట్లు పంచిపెట్టారు. జీఓ ఇవ్వడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంబీ కృష్ణయాదవ్, జంగిటి మురళీధర్‌యాదవ్, నాగెల్లి అంజన్‌యాదవ్, జంగిటి ప్రవీణ్‌యాదవ్, ఉడతా రామ్‌యాదవ్ పాల్గొన్నారు.

సంబరంగా సదర్ సమ్మేళనం..

సనత్‌నగర్: యాదవ సదర్ సమ్మేళన ఉత్సవాలను సనత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. దున్నపోతులను అందంగా అలంకరించారు. వాటిపై హాకీస్టిక్‌లు పట్టుకొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తీన్మార్ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ వేడుకల్లో యల్లావుల చక్రధర్‌యాదవ్, బుట్టి రాజశేఖర్, ముచ్చర్ల ఆంజనేయులుయాదవ్, పోచబోయిన అశోక్‌యాదవ్, రాజు, నిర్వాహకుడు మల్లేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

✦ సనత్‌నగర్‌లో జరిగిన యాదవ సదర్ ఉత్సవాల్లో బీజేపీ సీనియర్ నేత, బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్ హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు ఆయన సదర్ శుభాకాంక్షలు తెలిపారు.


సదర్ ఉత్సవాల్లో వెల్లాల రామ్మోహన్..

కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

- ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం
- సనత్‌నగర్ ఓటర్లు : 2,54,165

సనత్‌నగర్: ఎన్నికల సంఘం గత నెల 29న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించింది. కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ ప్రక్రియను పూర్తిచేసిన అధికారులు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి అభ్యంతరాల స్వీకరణను చేపట్టింది. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,165 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇందులో 1,31,385 మంది పురుషులు, 1,22,767 మంది మహిళలు, థర్డ్ జెండర్ 13 మంది ఉన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 97 లొకేషన్స్‌లో 229 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయి. ఈ నెల 28 వరకు నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అదేవిధంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 9, 10 తేదీల్లో (శని, ఆదివారాలు) నియోజకవర్గంలోని 229 పోలింగ్ బూత్‌ల్లో ఓటరు జాబితాలను ప్రదర్శించనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ బూత్‌ల్లో అందుబాటులో ఉంటారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండుతున్న వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఆయా తేదీల్లో అందుబాటులో ఉండే బీఎల్‌ఓలకు కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు అందజేయవచ్చు. లేనిపక్షంలో ఆన్‌లైన్‌లో కూడా స్వీకరిస్తారు. కొత్తగా పేరు నమోదుకు ఫారం–6, పేర్లు తొలగించుకునేందుకు ఫారం–7, పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్పునకు ఫారం–8 దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం జనవరి 6, 2025న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.



పెరిగిన ఓటర్లు 784...

గత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 25న విడుదలైన తుది జాబితాతో పోలిస్తే ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 784 మంది ఓటర్లు పెరిగారు. పార్లమెంట్ ఎన్నికల సమయానికి 2,53,381 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం ముసాయిదా ఓటరు జాబితా మేరకు 2,54,165 మంది ఓటర్లకు పెరిగారు. అందులో కొత్తగా 311 మంది పురుషులు, 472 మంది మహిళలు, ఒక థర్డ్ జెండర్ ఓటరుగా నమోదయ్యారు.